క్లుప్తంగా

ఇంటింటి ప్రచారంలో బీజేపీ బిజీబిజీ



ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

దౌల్తాబాద్: ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు బిజీబిజీగా ఉన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలపై ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. బీజేపీ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలను చెబుతున్నారు. రానున్న రోజుల్లో బీజేపీకి పట్టం కట్టాలని కోరుతున్నారు. నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన న్యాయవాది



కాసాని ఆధ్వర్యంలో పార్టీలో చేరిన బాలముకుందం

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సీనియర్ న్యాయవాది అయిన బాలముకుందం ముదిరాజ్ గురువారం తెలుగు దేశం పార్టీలో చేరారు. ఈ మేరకు టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నివాసంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడారు. పరిగిలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి, రానున్న ఎన్నికల్లో దేశం అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలముకుందం మాట్లాడారు. పార్టీ అభ్యున్నతికి నిర్విరామంగా కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు మాణిక్యం, విజయభాస్కర్, ముకుంద వెంకటేశ్ పాల్గొన్నారు.

నాటకం నయనానందం



నాటక పాత్ర ధారులు

యాలాల: విరాట పర్వంలోని కీచకవధ ఖండంలో నుంచి 'భీమసేన విలాసం' వీధి నాటకాన్ని బండమీదిపల్లిలో బుధవారం రాత్రి ప్రదర్శించారు. గ్రామానికి చెందిన వేంకటేశ్వర స్వామి భజన మండలి సభ్యులు ఈ నాటకంలో పాత్రలు పోషించారు. నాటకం చూడటానికి గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చి వీక్షించారు. నాటకానికి చాకలి పుల్లప్ప డైరెక్టర్ వహించగా, హార్మోనియం కొమ్ము సందప్ప, తబలిస్ట్‌గా చెట్టుకింది అంజయ్య పనిచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మప్ప, అనంతయ్య, వీరన్న, హన్మప్ప, బాలప్ప, సంగప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతగిరి: వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో అనాథల హరిగోస దీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌పీ కోఆర్డినేటర్ ఆనంద్, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడారు. 2015లో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అనాథలను చేరదీసి సంక్షేమ హాస్టల్‌లో ఉంచి అన్ని విధాలా తామే చూసుకుంటామని హామీ ఇచ్చారని, కానీ అది కలగానే మిగిలిపోయిందన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామానికి చెందిన పుర్ర అంజిలమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో రూ.5వేలు తక్షణ సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కేశవులు, బాబు, పులియాదయ్య పాల్గొన్నారు.

అధికారులకు బదులు.. కంప్యూటర్ ఆపరేటర్లు

మోమిన్‌పేట: మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చినప్పుడు సంబంధిత శాఖ అధికారి సమాధానం ఇవ్వాలి. ఒక వేళ అధికారి గైర్హాజరు అయితే ముందస్తుగా సమాచారం ఇవ్వాలి. కానీ సంబంధిత శాఖల అధికారులు గైర్హాజరు అయి.. కిందిస్థాయి కంప్యూటర్ ఆపరేటర్లను సమీక్షలకు పంపిస్తున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే మా సారుకు చెబుతాం.. అంటూ సభలో పేర్కొంటున్నారు. ఇలా చెప్పడం ఎంత వరకు సమంజసమని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. తదుపరి సమావేశాలకు ఇలాంటి వారిని పంపించకూడదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యాశాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో ఎంఈఓ గోపాల్ గైర్హాజర్ కావడం, అందులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌ను సమావేశానికి పంపించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.



కొడంగల్: అమరవీరుల స్తూపం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు



పరిగి: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



ధారూరులో.. ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ చంద్రశేఖర్ తదితరులు



తాండూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..

వీరులారా వందనం

మూడు వారాల పాటు పల్లెపల్లెన మురిపెంగా సాగిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు గురువారంతో అట్టహాసంగా ముగిశాయి. ఈ నెల 2న అవతరణ దినోత్సవంతో ప్రారంభమై.. 22న అమరుల త్యాగాలను స్మరించుకొంటూ ముగించుకున్న సంబురాల్లో సకల జనులు.. త్యాగధనులకు బరువెక్కిన గుండెలతో నివాళి అర్పించారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడారు. 'ఎందరో బిడ్డలు ఆత్మబలిదానం చేయడం వల్లే.. తెలంగాణ సిద్ధించింది. వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేం' అని చెప్పారు. – సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్ అర్బన్‌లో.. చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు



పెద్దేముల్‌లో: మండల పరిషత్ కార్యాలయంలో



కుల్కచర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో..



బంట్వారంలో.. ఎంఈఓ చంద్రప్ప తదితరులు



కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో నాయకులు



దోమలో..



పూడూరు: ఎంపీపీ మల్లేశం తదితరులు



యాలాలలో.. ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా



అనంతగిరిలో.. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



బొంరాస్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో.. అధికారులు



మర్పల్లిలో.. నివాళి అర్పిస్తున్న ఎంపీపీ లలిత, జెడ్పీటీసీ మధుకర్



దౌల్తాబాద్‌లో నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

టీఆర్‌టీ నోటిఫికేషన్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం

బంట్వారం: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) నోటిఫికేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని డీఎడ్ అభ్యర్థుల సంఘం, నిరుద్యోగ జాక్ జిల్లా నాయకుడు అజీమ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ పరీక్ష నిర్వహించి ఏడాది కావస్తున్నా.. టీచర్ పోస్టులపై ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికే టెట్ పాసైన అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని వాపోయారు. దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. వెంటనే టీఆర్‌టీ టిఫికేషన్ జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడలా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సాగు సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

ధారూరు: సాగు పెట్టుబడి సాయం కోసం కొత్తగా పట్టాలు పొందిన రైతులు రైతుబంధు పథకం వర్తించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ధారూరు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్ ఒక ప్రకటనలో సూచించారు. జూన్ 16, 2023 వరకు భూములు కొనుగోలు చేసి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు.. రైతుబంధుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. రైతుబంధు పథకం దరఖాస్తు ఫారం నింపి పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను జతచేసి వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. బ్యాంకు అకౌంట్ నంబర్ మార్పు కోసం, ఇతర సమస్యలున్న రైతులు తమను సంప్రదించాలని సూచించారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించండి

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్థిక స్తోమత సరిగా లేని వారి పిల్లలే చదువుతున్నారు కాబట్టి, వారికి సహాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నవాబుపేట మండలం ఎల్లకొండ, లింగంపల్లి, గొల్లగూడ, పులుమామిడిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు గొండ్ల శ్రీనివాస్‌గౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సహాయం చేసి, ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటించకపోతే ఫైన్



వాహనదారులు, దుకాణదారులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం

కుల్కచర్ల: రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలతో పాటు, రూ.3వేలు ఫైన్ వేస్తామని కుల్కచర్ల ఎస్‌ఐ శ్రీశైలం హెచ్చరించారు. గురువారం ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, సర్పంచ్ సౌమ్యారెడ్డిల ఆధ్వర్యంలో రోడ్డుపై వాహనాలు నిలిపిన వాహనదారులకు సూచనలు చేశారు. ఇకపై రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపరాదని, అలా పార్కింగ్ చేస్తే చర్యలతో పాటు, ఫైన్ తప్పదన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా దుకాణాలు ఏర్పాటు చేయరాదని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వారు వెనక్కి జరుపుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నేతలు కృష్ణయ్య, వెంకట్రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పేరిట ప్రచారం..



కొడంగల్: కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కొడంగల్: ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను బీఆర్‌ఎస్ పార్టీ అప్పుల పాలు చేసిందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆదేశాల మేరకు చేసిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్ నివాసం నుంచి ఊరేగింపుగా వచ్చి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పార్టీ ప్రచారం చేసుకుంటుందని ఆరోపించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, నయీం, ఆసిఫ్‌ఖాన్, శంకర్ నాయక్, బాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, సోమశేఖర్, దత్తు, దాము, అరిగె ఓం తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు పట్టని అధికారులు

- సర్వసభ్య సమావేశంలో సర్పంచులు



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ వసంత

మోమిన్‌పేట: 'పల్లెల్లో కరెంటు కష్టాలు పెరిగాయి. తరుచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటి బాధ్యత ఎవరు తీసుకోవాలి అని' పలువురు సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వసంత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సర్పంచులు మాట్లాడారు. సమావేశానికి విద్యుత్ ఏఈ వినోద్‌కుమార్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలు తలెత్తితే.. వాటి పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని వాపోయారు. ప్రతి సమావేశానికి కిందిస్థాయి ఉద్యోగులను పంపిస్తున్నారని ఆరోపించారు. చంద్రాయన్‌పల్లి సర్పంచ్ అంజయ్య మాట్లాడుతూ ఒకే నెలలో మూడుసార్లు విద్యుత్ ట్రాన్స్‌ఫారం కాలిపోతే తాండూరుకు పంపించారన్నారు. అందుకు అవసరమైన ఖర్చులు ఎవరు భరించాలని ప్రశ్నించారు. గ్రామాల్లో భగీరథ నీటికి బిగించిన కుళాయిల చక్రలు కొంత మంది తొలగించి ఇతరులకు నీరు రాకుండా చేస్తున్నారని మొరంగపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన భగీరథ ఏఈ నయనశ్రీ మాట్లాడుతూ అందుకు పూర్తి బాధ్యత సర్పంచులే తీసుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే కేసులు పెట్టే బాధ్యత పంచాయతీలపై ఉందని తెలిపారు. ఎంపీడీఓ శైలజారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆఫర్లతో ఆకట్టుకుంటున్న ఆర్టీసీ

- సురక్షితమైన ప్రయాణం చేయండి.. సంస్థ అభివృద్ధికి తోడ్పడంటూ ప్రచారం
- టీ9(60) టికెట్‌తో ప్రయాణికులకు మరింత చేరువ



వికారాబాద్ ఆర్టీసీ డిపో

అనంతగిరి: తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులను ఆకర్షించడానికి సరికొత్త ఆఫర్లను తీసుకువస్తోంది. సంస్థను ఎలాగైనా గట్టెంకించాలనే సంకల్పంతో పాటు ప్రయాణికులు ప్రవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా.. ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం చేయాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతోంది. ఇందులో భాగంగా సంస్థ ఎండీ సజ్జనార్ టీ9 టికెట్ అనే సరికొత్త స్కీంను ప్రారంభించారు. ఈ ఆఫర్‌తో 60 కిమీల దూరంలో ప్రయాణించే వారికి లాభం చేకూరుతోంది. ఈ టికెట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తుంది. ఉదయం 9గంటల అనంతరం బస్సులో ఎక్కి రూ.100తో టీ9 టికెట్ తీసుకోవాలి. దిగాల్సిన స్టాప్ వద్ద దిగడం.. సాయంత్రం వరకు మరలా అదే టికెట్‌పై గమ్యానికి చేరుకోవచ్చును. ఈ టికెట్లు పల్లె వెలుగు బస్సు కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయి. మహిళలు, సీనియర్ సిటీజన్లకు ఈ టికెట్ వర్తిస్తుంది. దీనిని కొనుగోలు చేయడంతో ఒక్కొక్కరికి రూ.20 నుంచి 40వరకు ఆదా చేసుకోవచ్చును. రూ.100 చెల్లిస్తే 60 కిమీల పరిధిలో రాను పోనూ ప్రయాణించే వెసులుబాటు కలదు. నిత్యం ఒకే రూట్‌లో ప్రయాణించే వారికి ఈ టికెట్ ఎంతో దోహదపడనుంది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధికారులు సూచిస్తున్నారు.



సంస్థ ప్రచురించిన కరపత్రం

వినియోగించుకోవాలి



ప్రయాణికులు టీ–9 టికెట్ కొనుగోలు చేసి తమ డబ్బును ఆదా చేసుకోవడంతో పాటు.. సురక్షితమైన ప్రయాణం చేసి, సంస్థ అభివృద్ధికి పాటుపడండి. ముఖ్యంగా నిత్యం ఒకే మార్గంలో 60 కిలో మీటర్ల మేర ప్రయాణం చేసే వారికి ఈ ఆఫర్ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజలు ఉపయోగించుకోవాలి.

– భక్షి నాయక్, డీఎం, వికారాబాద్

పందుల బెడద తొలగించండి



జీపీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: పందులతో తాము తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని కుల్కచర్ల గ్రామస్తులు గ్రామపంచాయతీ ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పందుల బెడద కారణంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదని, అధికారులు స్పందించి పందులను ఇక్కడి నుంచి పారదోలేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పందించిన సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. వారం రోజుల్లో వరాహాలను తరలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడసంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, వార్డు సభ్యులు మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు ఆరువందలే..

- అవగాహన లేక దరఖాస్తుకు దూరమైన కులవృత్తిదారులు

దౌల్తాబాద్: బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తానన్న రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం మండలంలో కేవలం 600మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులకు సకాలంలో ధ్రువపత్రాలు అందలేదు. చాలా మందికి పథకం గురించి అవగాహన లేకపోవడంతో స్కీంకు దూరమైనట్లు తెలుస్తోంది. మండలంలో కులవృత్తిదారులు సుమారు 4వేలకు పైగా ఉండగా.. కేవలం 600మంది మాత్రమే దరఖాస్తు చేసుకొని, ఎంపీడీఓ కార్యాలయంలో పత్రాలు అందజేశారు. దళితబంధు తరహా బీసీలకు ఆర్థిక సహాయం అందించేందుకు సాయమందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 20వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. గడువు పొడగిస్తారని భావించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలన..

కులవృత్తి ఆర్థిక సహాయం మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నుంచి పరిశీలన ప్రారంభించారు. ఈ నెల 26వరకు పరిశీలించి, అనంతరం దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నారు. అనంతరం ఎంపిక కమిటీ వాటిని మరోసారి పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తుంది. జాబితాను జిల్లా మంత్రి, ఎమ్మెల్యేకు పంపిస్తారు. ఈ నెల 27నుంచి జులై 4వరకు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు.

చట్టాల గురించి తెలుసుకోండి

బొంరాస్‌పేట: పోలీసు చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసు కళాజాత నిర్వహించారు. వికారాబాద్ పోలీసు కళాబృందం అవగాహన కల్పించింది. రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మూఢనమ్మకాలు, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు.



తుంకిమెట్లలో పోలీసు కళాజాత